# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

మంగళవారం | 23 జూన్, 2026 | పేజీలు :08


## మత్తు పదార్థాలు జీవితాన్ని నాశనం చేస్తాయి: ఎసిపి మాధవి




**ప్రజాపక్షం/హుజురాబాద్:** మత్తు పదార్థాలు వాడిన ప్రతి ఒక్కరి జీవితాన్ని నాశనం చేస్తాయని హుజురాబాద్ ఏసిపి మాధవి అన్నారు. కరీంనగర్ సిపి గౌస్ అలం ఆదేశాల మేరకు సోమవారం హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మత్తు పదార్థాల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకుని చదవిస్తారని వారి ఆశయాలకు అనుగుణంగా చదివి ప్రయోజకులు కావాలని అన్నారు. మత్తు పదార్థాల వాడకం వల్ల సంఘ విద్రోహ చర్యలకు పాల్పడే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రతి విద్యార్థి తమజీవితంలో ఒక గొప్ప ఆశయాన్ని ఏర్పాటు చేసుకుని దానికి అనుగుణంగా చదవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ కరుణాకర్‌తో పాటు కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదు

### కలెక్టర్ భవేశ్‌మిశ్రా

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులను సూచించారు. మండలాల వారిగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబందిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్యా, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పించన్లు, భూ సమస్యలను కలెక్టర్‌కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి సంబంధించి జిల్లా ప్రత్యేక అధికారి సమీక్షా సమావేశానికి సిద్దంగా ఉండాలన్నారు. శాఖల వారిగా చేపట్టిన కార్యక్రమాలు, సక్సెస్ స్టోరీలు, నివేదికలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖకు సంబంధించి "నషా ముక్త్ భారత్ అభియాన్" గోడ ప్రతులను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు బి.వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డి.ఆర్.ఓ. రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో 192 మంది దరఖాస్తులు



**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఫైల్ ట్రాకింగ్ చేస్తున్నామని దరఖాస్తులను పెండింగ్లో ఉంచకుండా పరిష్కారించడానికి అన్ని చర్యలుతీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 192 మంది అర్జీదారులు సమర్పించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి శాఖ వారిగా ఆన్లైన్లో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్నామని చెప్పారు. శాఖల వారీగా దరఖాస్తుల సంఖ్య, పెండింగ్ దరఖాస్తులను సమీక్షించారు. ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ అన్నారు. ప్రజావాణిలో అశ్విని తానాజీ వాకడే, డిఆర్ఓ స్వామి ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల పరిష్కారంలో
# జాప్యానికి తావివ్వొద్దు: కలెక్టర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ,అదనపు కలెక్టర్లు జే. అరుణ శ్రీ, కొప్పుల వెంకట్ రెడ్డి లతో కలిసి జిల్లా అధికారులతో పరిపాలనా అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులు, వినతిపత్రాల పరిష్కారం పై అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకూడదని,ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులో పరిష్కరించి తప్పనిసరిగా సమాధానం అందించాలని ఆదేశించారు.పారదర్శకత,జవాబుదారీతనం ప్రతి అధికారిలో ఉండాలని, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద వచ్చే దరఖాస్తులకు కూడా నిర్ణీత సమయంలో సమాధానాలు అందించాలని సూచించారు.జిల్లా పరిపాలనలోని అధికారులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరు కావాలని, అన్ని శాఖలు తమ పరిధిలోని ఫీల్డ్ సిబ్బంది హాజరు, పని తీరును నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా ప్రజలకు అందేలా శాఖాధిపతులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.కొన్ని శాఖల్లో ఫైళ్ల పరిష్కారంలో అనవసర జాప్యం జరుగుతోందన్న ఫిర్యాదులు వస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి శాఖాధికారి తమ శాఖలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను క్రమం తప్పకుండా సమీక్షించి, ఉద్దేశపూర్వక జాప్యాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు.కొంతమంది ఫీల్డ్ సిబ్బంది లంచాలు డిమాండ్ చేస్తున్నారన్న ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని, అవినీతిని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు.అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, హానరేరియం సిబ్బందికి వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని, సంబంధిత శాఖలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.అన్ని శాఖలు తమకు సంబంధించిన వివరాలను సంక్షిప్తంగా, నాణ్యతతో కూడిన సమాచారంగా సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. సమర్పించే నివేదికలు వాస్తవాధారితంగా, సమగ్రంగా ఉండాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ఆర్డీవోలు గంగయ్య, సురేష్, జిల్లా స్థాయి అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

**ప్రజాపక్షం/కరీంనగర్‌:** అంతర్జాతీయ మాదకద్ర వ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినో త్సవం (జూన్‌–26) సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమాలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సోమవారం సీపీ కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ వీక్ కార్యక్ర మాలల్లో భాగంగా పాఠశాలలు, కళాశాలల్లో మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన సదస్సులు, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సంతకాల సేకరణ, డ్రగ్–ఫ్రీ క్యాంపస్ డిక్లరేషన్ కార్యక్రమాలు, కమ్యూనిటీ విజిలెన్స్ కమిటీల ఏర్పాటు వంటి కార్యక్రమాలు వారం రోజుల పాటు నిర్వహిం చనున్నట్లు తెలిపారు. యువత మాదకద్ర వ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపా ధ్యాయులు, ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీ సులకు సహకరించాలని ఆయన కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



## విప్లవ కవి అలిశెట్టి ప్రభాకర్ అవార్డు ప్రదానం



**ప్రజాపక్షం/జమ్మికుంట :** ప్రపంచ సంగీత దినో త్సవం సందర్భంగా ప్రవీణ్ సల్వాజీ గ్రూప్ ఆధ్వ ర్యంలో కరీంనగర్ కళాభారతిలో నిర్వహించిన వరల్డ్ మ్యూజిక్ డే సెలబ్రేషన్స్ కార్యక్రమంలో ప్రముఖ విప్లవ కవి అలిశెట్టి ప్రభాకర్ మెమోరి యల్ అవార్డును కళారంగంలో అనేక సామాజిక సాంస్కృతిక విప్లవోద్యమాల్లో తన రచనలతో తన మధురమైన గానంతో సుదీర్ఘంగా 30 సంవత్సరా లుగా ప్రజలను చైతన్యంవైపు నడిపిస్తూ తెలంగాణ ఉద్యమంలో కాలికి గజ్జ కట్టి, గోసి గొంగడేసి పల్లె పల్లె తిరిగి కోట్లాది మంది ప్రజలను యుద్ధం వైపు నడిపించి రాష్ట్రం సిద్ధించేవరకు అలుపెరుగని పోరాటం చేసి కళా రంగంలో అశేషమైన కృషి చేసి నందుకుగాను ప్రముఖ వాగ్గేయకారుడు రామంచ భరత్‌కు ఈ అవార్డును అందజేశారు. సకల సాంస్కృతిక సంఘం, ప్రవీణ్ శివాజీ గ్రూప్ ఆధ్వ ర్యంలో ప్రముఖ సినీ గేయ రచయిత వరంగల్ శ్రీనివాస్, వాగ్గేయకారుడు తెల్లం మురళీ మధు, మ్యూజిక్ డైరెక్టర్ జీవల్ నాందేవ్ నిర్వాహకులు ప్రవీణ్ సల్వాజీ చేతులమీదుగా విప్లవ కవి అలి శెట్టి ప్రభాకర్ మెమోరియల్ అవార్డును అందుకు న్నందుకు గర్వకారణంగా ఉందని ఈ అవార్డును నాకు అందించిన సకల కలల సాంస్కృతిక సంఘం, ప్రవీణ్ సల్వాజీ గ్రూప్ కి సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

## మద్యం విక్రయిస్తే భారీ జరిమానా

**ప్రజాపక్షం/జమ్మికుంట :** మండలంలోని మడి పల్లి గ్రామంలో బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తే భారీ జరిమానా విధిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకునేలా మడిపల్లి గ్రామ పంచాయితీ పాలక వర్గం తీర్మాణం చేశారు. గ్రామంలో మద్యం అమ్మి నవారిపై రూ.10 వేలజరిమానా విధిస్తామని అలాగే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని మద్యం అమ్మినవారి సమాచారమిస్తే వారికి రూ.2 వేలు బహుమతి ప్రధానం చేస్తామని పాలక వర్గం తీర్మాణంలో పేర్కొన్నారు. సర్పంచ్ పసుల తిరుమల, ఉప సర్పంచ్ కస్తూరి శ్రీనాథ్, వార్డు సభ్యులు సురేష్, సాయిరాం, హసీనా, శ్రీనివాస్, కళ్యాణి, శేషివాదన ఆంజనేయులు, చంద్రమౌళి రాణి ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. ఈమేరకు సోమవారం సర్పంచ్ తిరుమల మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు. గ్రామ పంచాయితీ పాల కవర్గం చేసిన తీర్మాణం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఫుట్ పాత్ ఆక్రమణలపై నగరపాలక సంస్థ చర్యలు



**ప్రజాపక్షం/కరీంనగర్‌:** నగరంలో పాదచారుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణే ధ్యేయంగా కరీంనగర్ నగరపాలక సంస్థ ఫుట్ పాత్ ఆక్రమణల పై ప్రత్యేక చర్యలు చేపట్టింది. కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదే శాల మేరకు సోమవారం నగరంలోని ప్రధాన కూడ ళ్లలో భారీ ఎత్తున ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆక్రమణ లను తొలగించారు. టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్ పోలీస్, మరియు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఫుట్ పాత్ లు, రోడ్ల పైకి వచ్చిన వ్యాపార దుకాణాలను వాటి బోర్డులను, తాత్కాలిక షెడ్లను, వ్యాపార సామగ్రిని తొలగిం చారు.నగరపాలక సంస్థ కార్యాలయం నుండి వెంకటే శ్వర టెంపుల్ రోడ్డు తో పాటు అమరవీరుల స్థూపం నుండి టవర్ సర్కిల్ మీదుగా రాజీవ్ చౌక్ తదితర టవర్ సర్కిల్ ప్రాంతం మొత్తం డ్రైవ్ చేపట్టి ఫుట్ పాత్ ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ అధికారులు వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఫుట్ పాత్ లు కేవలం పాదచారులు నడవడా నికి మాత్రమేనని, వాటిని ఆక్రమించి వ్యాపారాలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. వ్యాపారులు తరుచుగా ఫుట్ పాత్ లను ఆక్రమించి ప్రజలకు ఇబ్బంది కలిగేలా వ్యాపారం చేస్తే మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఫుట్ పాత్ ఆక్ర మణల తొలగింపు ప్రత్యేక డ్రైవ్ ను నిరంతరంగా కొన సాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏసీపి వేణు, శ్రీధర్, ట్రాఫిక్ పోలీస్, డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై అవగాహన




**ప్రజాపక్షం/గంగాధర :** మాదక ద్రవ్యాల నిర్మూలన అలాగే యువతలో అవగాహన పెంపొందించేందుకు గంగాధర ఎస్సై వంశీ కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని మహాత్మగాంధీ జ్యోతిభాపూలే బాలుర పాఠశాలలో యాంటీ డ్రగ్స్ అవగా హన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్‌ను నాశనం చేసే ప్రమాద కరమైన వ్యసనమని విద్యార్థులు వాటికి దూరంగా ఉండి విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలను వివరించి మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వా ములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే విద్యార్థు లకు యాంటీ డ్రగ్స్ అవగాహన స్వచ్ఛంద సేవా కార్య క్రమాలు, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సామాజిక బాధ్యత, చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో దమ్మని రాము, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబును విమర్శించే స్థాయి పుట్ట మధుకు లేదు



**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** మంత్రి శ్రీధర్ బాబును విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు లేదని టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం మండిప డ్డారు. సోమవారం కరీంనగర్ లోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంథని మాజీ ఎమ్మెల్యే పెద్దఎత్తున అక్రమ ఆస్తులు కూడబెట్టారని అందుకు సంబంధించిన పూర్తి చిట్టా తమ వద్ద సిద్ధంగా ఉందని సంచలన ఆరోపణలు చేశారు. పెద్దపల్లి జడ్పీ చైర్మన్ కాకముందు పుట్ట మధు ఆస్తులు ఎంత ప్రస్తుతం ఎంత అనే విషయాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పుట్ట మధు ఆస్తులపై విచారణ జరిపించాలని అన్నారు. దివంగత నేత దుద్దిళ్ల శ్రీపాదరావు పెట్టిన రాజకీయ భిక్షతోనే పుట్ట మధు ఈ స్థాయికి వచ్చారని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురించి మాట్లాడే నైతిక అర్హత మధుకు లేదని ఆయన నోరు అదుపులో ఉంచుకోవాలని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరిట రూ.1.50 లక్షల కోట్ల వ్యయంలో లక్ష కోట్ల మేర అవినీతి జరిగిందని ఆరోపించారు. హైదరాబా ద్‌లో వేల కోట్ల విలువైన సుమారు 30 వేల ఎకరాల భూములను ఆక్రమించారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పార్టీని బిజెపిలో విలీనం కాబోతుం దని జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు సమ్మద్రాల అజయ్ , కేశవేని రవీందర్ యాదవ్ తదిత రులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు కొండపాక గ్రామస్థుల వినతి

**ప్రజాపక్షం/వీణవంక :** మండలంలోని పోతిరెడ్డిపల్లి పేరు మీద కొనసాగుతున్న ఇసుక రీచ్‌ను కొండపాక గ్రామానికి మార్చాలని కోరుతూ సోమవారం కొండపాక ఉప సర్పంచ్ పూరేళ్ల కుమార్‌తో పాటు గ్రామస్థులు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాకు వినతి పత్రం అంద జేశారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన ప్రజావాణి కార్యక్ర మంలో ఈ దరఖాస్తును అందించారు. వినతిపత్రం అందజేసినవా రిలో వార్డు సభ్యులు దాట్ల శ్రీనివాస్, కత్తి సురేశ్‌కొలుగూరి రాజేశ్, కె.తిరుపతి, నల్లగాశ కుమారస్వామి, కాసర్ల అనిల్ ఉన్నారు.

## విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై అవగాహన



**ప్రజాపక్షం/వీణవంక :** వీణవంక మండల పరిధిలోని చల్లూరు ప్రభుత్వ పాఠశాల, ఘన్ముక్ల టిజి మాడల్ స్కూల్‌లో జూన్ 26 అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివా రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఆవుల తిరుపతి మాట్లాడుతూ విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాల గురించి వివరించారు. అలాగే మాదక ద్రవ్యాల వ్యసనం వ్యక్తి గత జీవితంతోపాటు కుటుంబం,సమాజంపై తీవ్ర ప్రభావం చూపు తుందని తెలిపారు. విద్యార్థులు వాటికి దూరంగా ఉండి విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావా లని పిలుపునిచ్చారు. అలాగే విద్యార్థులకు యాంటీ డ్రగ్స్ అవగా హన స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సామా జిక బాధ్యత, చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఓ ఆకస్మిక తనిఖీలు

**ప్రజాపక్షం/జమ్మికుంట :** మండలంలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హుజురాబాద్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ప్రభుదాస్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో భాగంగా ఆరోగ్య కేంద్రంలోని అన్ని రికార్డులు, ఫార్మసీ గదిని పరి శీలించి తగిన మందులు అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు ప్రణాళికలు తయారు చేసుకొని వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. వైద్య సిబ్బంది అందరూ సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానలో ప్రసవాలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. జాతీయ కార్యక్రమాలపై ప్రజలకు అవగాన కల్పించి పిహెచ్‌సి టార్గెట్స్ ను రీచ్ కావాల న్నారు. ఈనెల 28 ఆదివారం రోజున జరిగే పల్స్ పోలియో కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డా.వరుణ, డా.శ్రవణ్ కుమార్, హెల్త్ సూపర్వైజర్ సదానందం, రజిత, కవిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పలు ప్రాంతాలను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

**ప్రజాపక్షం/జమ్మికుంట :** పట్టణ పరిధిలో కురిసిన వర్షానికి హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి అంబేద్కర్ కాలనీ మీదుగా వచ్చేటు వంటి వరద నీటి డ్రైనేజీ పరిస్థితిని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పట్టణ పరిధిలోని 30 వార్డులకు గాను వర్షాల కారణంగా నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు ప్రణాళికలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజకు ఎక్కడ కూడా ఏలాంటి సమస్యలు తలెత్తకుండా తమ పాలకవర్గం అనునిత్యం అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు.

## విద్యార్థులకు స్కాలర్ షిప్ అందజేత

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ (మోడల్ స్కూల్) పాఠశాలలో 2025 26 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం ఎడమల ఎల్లారెడ్డి జ్ఞాపకార్థం ఎడమల భోజేందర్ రెడ్డి ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. పదవ తరగతిలో ప్రథమ స్థానం సాధించి చిర్ర వైష్ణవి కి రూ. 15 వేలు ద్వితీయ స్థానం సాధించిన బండారు కీర్తికి రూ. 10 వేలు తృతీయ స్థానం సాధించిన రంగు రసజ్ఞ కి రూ. 5 వేలు రూపాయలు వీరితో పాటు మండల కేంద్రంలోని మల్లన్న పేట గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ప్రథమ స్థానం సాధించిన పడాల అక్షయ కి రూ. 10 వేలు ద్వితీయ స్థానం సాధించిన మామిడిపెల్లి సాహిత్య కి రూ.5 వేలు రూపాయలను ప్రోత్సాహకంగా అందజేశారు . 2026 –27 విద్యాసంవత్సరం లో కూడా పదవ తరగతిలో ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్షిప్ ను యథావిధిగా అందజేస్తామని భోజేందర్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు ఆవారి చందు,శంకర్రావుపేట ఉప సర్పంచ్ గుర్రం రంజిత్ రెడ్డి , గోలి రమేష్ ,ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సుంకరి రవి , కళ్లెం కిషోర్ కుమార్, ఉపాధ్యాయ బృందం మల్లన్న పేట గ్రామ సర్పంచ్ సిద్దంకి లక్ష్మీ మల్లారెడ్డి ,శంకర్రావుపేట సర్పంచ్ గోలి గంగారెడ్డి,వెంగలాపూర్ సర్పంచ్ రామ్ రెడ్డి, పాల్గొన్నారు.

## పాత బస్టాండ్ వద్ద పోలీసు పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలి

మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి

ప్రజాపక్షం/జగిత్యాల : జగిత్యాల పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదిత పెట్రోల్, డీజిల్ పంపును తక్షణమే ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు.ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ పాత బస్టాండ్ సమీపంలోని పోలీసు క్వార్టర్స్ స్థలాన్ని వాణిజ్యపరంగా వినియోగించే అవకాశం ఉందన్నారు. ఆ ప్రదేశంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తే వాహనదారులకు మెరుగైన సేవలు అందడంతో పాటు ట్రాఫిక్ రద్దీ సమస్యకు కొంతమేర పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ ప్రతిపాదనకు సంబంధించి జిల్లా పోలీసు శాఖ ఉన్నతాధికారుల అనుమతులు కూడా లభించినట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. ఈ పెట్రోల్ బంక్ ఆదర్శవంతంగా నిర్వహించబడితే వచ్చే ఆదాయాన్ని పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించే అవకాశం ఉంటుందని చెప్పారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పంపు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు పోలీసు శాఖకు మంచి పేరు తీసుకువస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. జిల్లా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెట్రోల్ బంక్ ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. ముఖ్యమంత్రికి రాసిన లేఖ ప్రతిని పోలీసు ఉన్నతాధికారులకు పంపడంతో పాటు సోమవారం జగిత్యాల జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ను కలిసి లేఖను అందజేసినట్లు జీవన్ రెడ్డి వెల్లడించారు.

# నైపుణ్యాల ప్రదర్శనకు డ్యూటీ మీట్ ఉత్తమ వేదిక

జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జిల్లా స్థాయి 3వ పోలీస్ డ్యూటీ మీట్– 2026 ప్రారంబించిన ఎస్పి




ప్రజాపక్షం/జగిత్యాల : పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో మరింత సమర్థవంతంగా రాణించాలంటే వృత్తి నైపుణ్యం అత్యంత అవసరమని, నేర దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, కేసుల ఛేదన, ప్రజా భద్రత పరిరక్షణ వంటి అంశాల్లో నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న జిల్లా 3వ పోలీస్ డ్యూటీ మీట్–2026 కార్యక్రమాన్ని అదనపు ఎస్పితో జిల్లా ఎస్పీ కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బందిలో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు,ఆధునిక దర్యాప్తు పద్ధతులు, ఫోరెన్సిక్ సాంకేతికతలు, నేర పరిశోధనలో అనుసరించాల్సిన ఉత్తమ విధానాలపై అవగాహన పెంపొందించేందుకు డ్యూటీ మీట్ ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని అన్నారు.పోలీసు శాఖలో ప్రతి అధికారి, సిబ్బంది చట్టాలపై సంపూర్ణ అవగాహనతో పాటు శాస్త్రీయ ఆధారాలతో న్యాయస్థానంలో దోషులుగా నిరూపించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు,ఇన్స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్, సుధాకర్, కరుణాకర్, రవి, లక్ష్మి నారాయణ, కిరణ్ కుమార్,వేణు తదితరులు ఉన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ లత



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా అదనపు కలెక్టర్బ్ లత అదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజా గౌడ్ తో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు,వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా లత మాట్లాడుతూపలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని,అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి113 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇది వరకు ప్రజావాణి లో వచ్చిన 182 పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని లేని యెడల సంబంధిత జిల్లా అధికారి బాధ్యునిగా చేస్తూ మెమో జారీ చేయబడునని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్,జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, ఉన్నారు.

# ఉప సర్పంచ్‌ల హక్కుల సాధనకు మహాధర్నా

ప్రతి ఒక్క ఉప సర్పంచ్ తరలి రావాలి

జగిత్యాలలో పోస్టర్ ఆవిష్కరణ, అంబేద్కర్ విగ్రహానికి నివాళులు

ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : ఉప సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ, గ్రామ పాలనలో వారికి తగిన గుర్తింపు కల్పించాలనే లక్ష్యంతో జూన్ 25న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఉప సర్పంచ్‌ల ఫోరమ్ రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చింది. రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యదర్శి మెరుగు జంపన్న (జానీ), రాష్ట్ర ఉపాధ్యక్షులు గానవేణి నందిని మల్లేష్ యాదవ్, జిల్లా అధ్యక్షులు ముత్యాల స్వామి ఆధ్వర్యంలో జగిత్యాలలో “ఛలో హైదరాబాద్” కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లాలోని పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ఉప సర్పంచ్‌లు సోమవారం జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. అంతకుముందు జిల్లా అధ్యక్షులు ముత్యాల స్వామి ఆధ్వర్యంలో తహసీల్ చౌరస్తా వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఛలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించి మహాధర్నా విజయవంతానికి కార్యాచరణను ప్రకటించారు.ఈ సందర్భంగా జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు ముత్యాల స్వామి మాట్లాడుతూపై జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్షులు తిరుపతి యాదవ్, పురెధి, అన్నారపు నర్సయ్య,శ్రీనివాస్, ముత్యం రెడ్డి, నర్స గౌడ్, రాకేష్ ,సాగర్, మొగుల సంజీవ్ చారి, వీరేశం, క్రాంతి,స్వామి, శ్యామ్, పరమేష్, రాకేష్ , ఏకాంబరం, జలేందర్, సింహారెడ్డి, , పాల్గొన్నారు.

# రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

రైతు నాయకుల డిమాండ్



ప్రజాపక్షం /మెట్‌పల్లి : గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని జిల్లా రైతు నాయకులు డిమాండ్ చేశారు. పసుపు, మక్కల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, చెరుకు ఫ్యాక్టరీ పునరుద్ధరణ తదితర డిమాండ్లతో 2021లో జిల్లా రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో మెట్‌పల్లి పాత బస్టాండ్ చౌరస్తాలో సుమారు 5,000 మంది రైతులతో శాంతియుతంగా నిరసన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.అయితే వేలాది మంది రైతులు పాల్గొన్న ఆందోళనలో కక్షపూరితంగా కేవలం 36 మంది రైతులపై మాత్రమే కేసులు నమోదు చేసి కోర్టుల చుట్టూ తిప్పారని రైతు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు పంటలు, పశువులను వదిలి కోర్టులకు హాజరుకావాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల సమస్యలను అర్థం చేసుకుని గత ప్రభుత్వం నమోదు చేసిన కేసులను వెంటనే రద్దు చేసి న్యాయం చేయాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతిపత్రం అందజేయడానికి వెళ్లినప్పటికీ, అప్పటి ప్రభుత్వం రైతులపై ఉక్కుపాదం మోపి అక్రమ కేసులు బనాయించిందని విమర్శించారు.2021 నుంచి ఇప్పటి వరకు కోర్టుల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న తమపై ప్రభుత్వం దయ చూపాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా పాలన, రైతు శ్రేయస్సును లక్ష్యంగా పెట్టుకున్న ప్రస్తుత ప్రభుత్వంలో రైతులకు న్యాయం జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, నాగుల వామన్ రెడ్డి, ఏలేటి మహిపాల్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## ధర్మపురి మండలంలో నేటి నుండి విత్తనమేళా

మండల వ్యవసాయ అధికారి ఎం.రాజకుమార్

ప్రజాపక్షం/ధర్మపురి : ఈనెల 23 నుండి 30 వరకు ఎనిమిది రోజుల పాటు ధర్మపురి మండల పరిధిలోని ధర్మపురి, తిమ్మాపూర్ రైతువేదిక లలో విత్తన మేళా నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎం.రాజకుమార్ తెలిపారు. ఈ విత్తన మేళాలో ప్రభుత్వం సాగుకు సూచించిన బీపీటీ 5204,అర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోన),హెచ్ఎంటి సోన,జై శ్రీరామ్,కేఎన్ఎం 1638, 7715 రకాల వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.అదేవిధంగా కందులు, పెసర్లు, మినుములు, కూరగాయల విత్తనాల ప్రదర్శన,విక్రయాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.నానో యూరియా,నానో డీఏపీ ఉత్పత్తులు సైతం అందుబాటులో వుంటాయని మేళా ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాజ కుమార్ సూచించారు.

## వివో ఎ లకు మోడల్ క్లస్టర్ లెవెల్ ఫెడరేషన్ పై శిక్షణ

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని శ్రీ సాయి మండల సమైక్య కార్యాలయంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డి ఆర్ డి ఏ)ఆధ్వర్యంలో సోమవారం వివో ఏలు ,గ్రామ సంఘాల ప్రతినిధులకు మోడల్ క్లస్టర్ లెవెల్ ఫెడరేషన్ (ఎంసీఎల్ ఎఫ్ )పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు .ఈ శిక్షణలో మండలంలోని 44 గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు .శిక్షణ కార్యక్రమానికి శిక్షకులు జ్యోతి ,రజిత పాల్గొని వివో ఏ లకు,గ్రామ సంఘాల ప్రతినిధులకు శిక్షణను అందించారు. ఈ సందర్భంగా ఏపిఎం రమాదేవి మాట్లాడుతూ రానున్న ఐదు సంవత్సరాలలో మహిళ స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలని సూచించారు.సూక్ష్మ పరిశ్రమలు ,జీవనోపాధి కార్యక్రమాల ద్వారా ఆదాయం పెంపొందించుకోవాలని బ్యాంకు లింకేజీ, శ్రీనిధి సిఐఎఫ్, పి ఎమ్ ఎఫ్ ఎమ్ ఈ,వంటి రుణ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.గ్రామాల్లో అందుబాటులో ఉన్న వనరులను ఆర్థిక స్థితిగతుల మెరుగుదలపై దృష్టి సారించి అన్ని రంగాల్లో పురోగతి సాధించాలని కోరారు .ఈ కార్యక్రమంలో శిక్షకులు రజిత ,జ్యోతి ,ఏపిఎం రమాదేవి ,సీసీలు గంగాధర్ ,మహేష్ ,శ్రీనివాస్,మల్లేశం ,మండల సమైక్య అధ్యక్షురాలు సాగరిక ,మండల సమైక్య సిబ్బంది అంజలి, మోహన్,గ్రామ సమాఖ్య వివో ఏలు,గ్రామ సంఘాల ప్రతినిధులు, పాల్గొన్నారు .

## ప్రజలకు పోలీస్ శాఖను చేరువచేయడమే లక్ష్యం

జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే ప్రధాన లక్ష్యమని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. ప్రజా గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్ ప్రజల నుండి వచ్చిన పలు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 17 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు.ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా, అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో పరిష్కరించగల సమస్యలను ఆలస్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని,విచారణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుంది

ప్రజాపక్షం /మెట్‌పల్లి : మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ ప్రభుత్వ పాఠశాలలో సర్పంచ్ పుల్ల జగన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సామూహిక విద్యాభ్యాస కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుందని అన్నారు.ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు,సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం పాఠశాలకు హాజరైన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు లక్ష్మణ్, మధు, తేజ,లక్ష్మి ,విద్యార్థులతల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

## గుంతలు ఏర్పడి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండల కేంద్రంలో భగత్ సింగ్ చౌరస్తా నుండి న్యూ బస్టాండ్ పోయే రహదారిలో సోమవారం కురిసిన వర్షానికి నీటి కుంట ఏర్పడి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. స్థానికులు ప్రజలు మాట్లాడుతూ, నీటి ప్రవాహం ఆగకుండా అధికారులు నాయకులు స్పందించి నీటి నిల్వ ఉండకుండా జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. వాహన దారులకు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు.

## పిడుగు పాటుతో మూగజీవాల మృత్యువాత



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** అకాల వర్షంతో పాటు పిడుగులు పడడంతో మూగజీవాలు మృతి చెందాయి. ఖానాపూర్ మండలం సత్తెనపల్లి గ్రామానికి చెందిన చౌటుపల్లి మల్లేష్ సోమవారం రోజున గ్రామానికి సమీపంలో గల పొరుగు గ్రామం అయినా అడవి సారంగాపూర్ అడవీ ప్రాంతానికి మేకలు గొర్లను మేతకు తీసుకెళ్ళాడు. మధ్యాహ్నం అకస్మాత్తుగా పిడుగులతో కూడిన భారీ వర్షం కురవడంతో మేతకు తీసుకువెళ్ళిన ఆరు మేకలు, ఐదు గొర్లు పిడుగు పడటంతో మృత్యువాత పడ్డాయని మల్లేష్ విచారం వ్యక్తం చేశాడు. కూలీ చేసుకుంటూ మేకలు మేపుకోవడమే తన జీవనాధారమని తన మేకల గొర్లు చనిపోవడంతో నష్టం వాటిల్లిందని ప్రభుతం ఈ విషయాన్ని గ్రహించి తనని ఆదుకోవాలని బాధతో తెలిపాడు.

## ఉద్యోగుల రాష్ట్ర సదస్సు గోడ ప్రతుల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని విశ్వేశ్వరయ్య భవన్ నందు సోమవారం నాడు పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర సదస్సు గోడ ప్రతులను పోస్టర్లను నిర్మల్ జిల్లా సంఘం ఆద్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈనెల 26వ తేదీన హైదరాబాద్ ఎల్బీనగర్ కామినేని చౌరస్తాలోని స్వకులశాలి సమాజ భవనంలో ఈ రాష్ట్ర సదస్సు జరగనుంది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బూర ఉమా శంకర్ మాట్లాడుతూ, నిర్మల్ జిల్లాలోని పద్మశాలి ఉద్యోగులందరూ ఈ సదస్సుకు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బూర ఉమా శంకర్‌తో పాటు ప్రధాన కార్యదర్శి గంగుల క్రాంతి కుమార్, ఉపాధ్యక్షులు లక్కవత్తుల రవికుమార్, ప్రచార కార్యదర్శి తూరాటి ముతేష్, కార్యాలయ కార్యదర్శి మైసర్ల సతీష్ పాల్గొన్నారు. అలాగే సంఘం సభ్యులు కందుల నర్సయ్య సిరిపురం రాజేశ్వర్, తోట నర్సయ్య బ్రహ్మదండి మోహన్, చింత సాయికిరణ్, ట్ల భూమయ్య, మిర్యాల శ్రీధర్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

**బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్**

**ప్రజాపక్షం/నస్పూర్ :** తెలంగాణ రాష్ట్రంలో 23 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి ఆ సంఖ్యను నాలుగు వేలకు కుదిస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి తక్షణమే ఈ ఆలోచనను ఉపసంహరించుకోవాలని కోరారు. విద్యార్థులకు దగ్గరలో పాఠశాల ఉండే విధంగా చూడాలని విద్యా హక్కు చట్టం 2009 లో స్పష్టంగా ఉందని గుర్తు చేశారు. ప్రభుత్వ నిర్ణయం గ్రామీణ పేద, బడుగు, బలహీన వర్గాల, దళిత, గిరిజన విద్యార్థుల ప్రాథమిక విద్యా హక్కును కాలరాసేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలోనూ ప్రభుత్వ పాఠశాల ఉండేలా చూస్తూ, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో విద్యకు 15 శాతం బడ్జెట్ కేటాయిస్తామని మహబూబ్‌నగర్‌లో పాదయాత్ర చేస్తున్న సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి రెండున్నర ఏండ్లు గడిచినా ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని ప్రభుత్వం కచ్చితంగా అమలు చేయాలన్నారు. ప్రస్తుతం విద్యారంగం వ్యాపారమయంగా మారిందని, పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలే దిక్కని పేర్కొన్నారు. రాజ్యాంగ లక్ష్యాలు సాధించాలంటే కేవలం విద్యతోనే సాధ్యమవుతుందని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లను రద్దు చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ బడుల పరిరక్షణ కోసం ప్రజా సంఘాలతో కలిసి అన్ని జిల్లా కేంద్రాలలో రౌండ్ టేబ్ల్ సమావేశాలు ఏర్పాటు చేస్తామని వలస సుభాష్ చంద్రబోస్ స్పష్టం చేశారు.

## గ్రామ అభివృద్ధే నా లక్ష్యం

**సర్పంచ్ కుమురం భీంరావ్**



**ప్రజాపక్షం/కేరమేరి :** తుమ్మగూడ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తన లక్ష్యమని సర్పంచ్ కుమురం భీంరావ్ స్పష్టం చేశారు. గ్రామంలో పారిశుధ్యం, తాగు నీటి సరఫరా, రహదారుల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వేగవంతం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో ఎన్ని ప్రలోభాలు, ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గేది లేదని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా బోర్వెల్ లకు మోటార్లు ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపారు. దశాబ్దాలుగా దెబ్బతిన్న అంతర్గత రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని తెలంగాణ గ్రామీణ అభివృద్ధి సంస్థ నిర్వహించిన సర్పంచుల జనరల్ ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో విజయవంతంగా పూర్తి చేసినందుకు కుమురం భీంరావ్ కు జిల్లా పంచాయతీ అధికారి చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం అందింది. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



**టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. ప్రేమ్‌కుమార్**

**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** మత్తు పదార్థాల వినియోగం వల్ల వ్యక్తి, కుటుంబం, సమాజంపై తీవ్ర దుష్ప్రభావాలు పడతాయని, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కాగజ్‌నగర్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. ప్రేమ్‌కుమార్ సూచించారు. సోమవారం కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండి బాగా చదివి మంచి ఉద్యోగాలు సాధించడంతో పాటు సమాజ సేవలోనూ భాగస్వాములు కావాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ కె. శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ దుర్గం జనార్దన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తూదూరు దత్తాత్రేయ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఇ. శారద, ముంజం రాజేశ్వర్, డాక్టర్ దేవేందర్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ‘జీబు రాజేశం’ షార్ట్ మూవీ షూటింగ్ ప్రారంభం

**ప్రజాపక్షం/జన్నారం :** కడెం మండలంలోని కల్లెడ గ్రామం, జన్నారం మండల పరిసర ప్రాంతాల్లో ‘జీబు రాజేశం’ అనే షార్ట్ మూవీ చిత్రీకరణ సందడిగా ప్రారంభమైంది. సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సమృత్ చింత దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ కథలోని ఉత్కంఠభరితమైన సన్నివేశాలకు అనువైన సహజ లోకేషన్లు, అడవులు, కొండలు ఇక్కడ ఉండటంతో చిత్రీకరణ చేపడుతున్నామని, ప్రేక్షకులకు ఇది కొత్త అనుభూతిని అందిస్తుందని తెలిపారు. ఈ చిత్ర నిర్మాణ కార్యక్రమాలు శ్రీ మల్లీశ్వరానంద అఘోర శివశక్తి త్రిశక్తి పీఠాధిపతి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నాయి. చిత్రానికి వెంకటేష్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, రవీంద్ర సిద్దార్థ్ సహాయ దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోందని, త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ కార్యక్రమంలో నటీనటులు అశోక్ బోగె, ప్రియా అవిరెడ్డి, ప్రవీణ్, గాజుల సహస్ర గౌడ్, యశోద మోక్షిత్, ప్రతాప్, స్థానిక యువత పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న ఎఇఒకు సన్మానం

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలోని ఏఈఒ, భూమేష్‌కు మరియు పంచాయతీ సెక్రెటరీకి రాజుకు గ్రామా వీడిసి మరియు సర్పంచ్ ఆధ్వర్యంలో అధికారులకు సన్మానం చేశారు. ఈ సం దర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అబ్దుల్లాపూర్ గ్రామాభివృద్ధికి అధికారులు చేసిన సేవలను స్మరించుకొన్నారు. నూత నంగా వచ్చిన పంచాయతీ సెక్రెటరీ కృష్ణవేణి మరియు ఏఈఓ సంగీతకు అభినందనలు తెలుపుతూ సన్మానం ఏశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయలలిత భోజన్న గ్రామ వీడీసి గ్రామస్తులు మాజీ సర్పంచ్ రమణారెడ్డి మాజీ ఎంపిటీసి ఇంద్ర, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల వేతనం ఒకేసారి ఇవ్వాలి




**ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు**

**ప్రజాపక్షం/మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా ఎంఎల్ఎస్ పాయింట్లలో పనిచేస్తున్న సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు డిమాండ్ చేశారు. నెలలో రెండు సార్లు వేతనాలు ఇవ్వడం సరికాదని, ప్రతి నెల ఒకేసారి కార్మికుల అకౌంట్లలో వేతనాలు జమ చేయాలని కోరుతూ అదనపు కలెక్టర్ రెవెన్యూ వడాల రాములుకు మెమొరాండం సమర్పించారు. గత మూడు నెలలుగా కట్ చేసిన 5070 రూపాయలను ప్రతి కార్మికుని అకౌంట్లో వెంటనే జమ చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించేలా చొరవ చూపాలని అదనపు కలెక్టర్లను వేడారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ కార్మికులు బైరి రాజన్న, పానుగంటి సత్యనారాయణ, తిప్పని సత్తయ్య, హరీష్, సైదం రాజు, తిరుపతి పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి




**జన్నారం ఎస్ఐ జి. ఉదయ్ కుమార్**

**ప్రజాపక్షం/జన్నారం :** మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను గ్రహించి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని జన్నారం ఎస్ఐ జి. ఉదయ్ కుమార్ పిలుపునిచ్చారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, మంచిర్యాల డిసిపి భాస్కర్, ఉన్నతాధికారుల సూచనలతో సోమవారం ఇందన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన్నారం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాల గురించి వివరించి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ జి. శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేందర్, పిజిటి ఉపాధ్యాయుడు తిరుపతి, ఇతర ఉపాధ్యాయులు, సుమారు వంద మంది విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్



**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సోమవారం జన్నారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అజ్మీరా నందునాయక్, నాయకులు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందడం ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల పట్ల నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జన్నారం సర్పంచ్ అజ్మీరా కళావతి, ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీ నారాయణ, ఉప సర్పంచ్ నయీం, పట్టణ అధ్యక్షులు మంద రాజేష్, మాజీ ఎంపిటిసి రియాజొద్దీన్, నాయకులు కట్టెకొల మహేశ్, ఆజర్, జహీర్, జీలకర గంగన్న, రసమల్లా పాపా గౌడ్, వార్డు సభ్యులు, అక్తర్, నాగేందర్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## జనక్ ప్రసాద్ పరామర్శ

**ప్రజాపక్షం/రామగిరి :** సోమవారం ఐఎన్టియుసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఉడుత శంకర్, తండ్రి ఉడుత రాయమల్లు గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నాడని తెలుసుకొని ఐఎన్టిసి సెక్రెటరీ జనరల్ కనీస వేతన చైర్మన్ జనక్ ప్రసాద్ పన్నూరు గ్రామానికి వచ్చి తన యొక్క ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని పరామర్శించి ఇంకా ఇబ్బందిగా ఏమైనా ఉంటే నాకు తెలియండి పెద్ద హాస్పిటల్కి మాట్లాడుతున్నా అని చెప్పి ధైర్యం ఇచ్చి. 20,000 రూపాయలు ఆర్థిక సాయం అం దజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.జి.3 వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ సెక్రెటరీ కిర ణ్ రెడ్డి మల్లారి మల్లారెడ్డి, సెంట్రల్ వైస్ ప్రె సి డెంట్ వడ్డేపల్లి దాస్ ఐ ఎన్ టి యు సి యూనియన్ నాయకులు పాల్గొన్నా రు.

## కరీంనగర్‌లో విద్య మాఫియా

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** కరీంనగర్ జిల్లాలో విద్యా వ్యాపారంగా కాకుండా విద్యా మాఫియాగా యధేచ్ఛగా కొనసాగుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకత్వ పిలుపుమేరకు జిల్లాలో బిఆర్ఎస్వీ విభాగం ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో నెలకొన్న అవస్థలు, వాటిపై స్పందన అనే పేరుతో ప్రత్యేక వినతిపత్రాన్ని సోమవారం అనిల్ కుమార్ గౌడ్ బిఆర్ఎస్వీ నేతలతో కలిసి కరీంనగర్ జిల్లా విద్యాధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న దోపిడీని డిఈవో దృష్టికి తీసుకెళ్లారు. నోటు పుస్తకాలు, యూనిఫార్మ్స్, స్టేషనరీ పేరుతో పేదవాళలను దండుకుంటున్నారని వీటిని అరికట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహారెడ్డి, ధర్మపురి, వైస్ ప్రెసిడెంట్ దాస్, సెక్రటరీలు గడ్డం తిరుపతి యాదవ్, రామారావు,ఉయ్యాల కుమారస్వామి, పిట్ సెక్రటరీలు రామిడ్ల మనోహర్, కె ఎన్ చారి, రాజ్‌కుమార్ మరియు కేంద్ర, బ్రాంచ్ మరియు పిట్ స్థాయి నాయకులు,కార్యకర్తలు హాజరయ్యారు.

## ముత్తారంలో జోరు వాన

**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా



ముత్తారం మండల కేంద్రంతో పాటు కేషనపల్లి,హరిపూరం, పోతారం,మైదంబండ, మచ్చుపేట తదితర గ్రామాల్లో సోమవారం జోరుగా వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రతను తట్టుకోలేక, వర్షాలు ఎప్పుడు పడతాయా అని ఎదురుచూస్తున్న రైతులకు ఈ వర్షం ఎంతో ఊరటనిచ్చింది. ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు వాతావరణం చల్లబడటంతో ఉపశమనం లభించింది. ఈ తొలి వర్షంతో సాగు పనులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడటంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నా రు.

# నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపాలి

### ఎరువుల కొరత తలెత్తకుండా చూడాలి
### ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో నకిలీ విత్తనాలు చలామణి కాకుండా పకడ్బంధీ చర్యలు చేపట్టాలని నకిలీ విక్రేతలపై ఉక్కుపాదం మోపాలని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. రైతాంగ ప్రయోజనాలను కాపాడటమే పరమావధిగా అంకితభావంతో కృషి చేయాలని హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి సోమవారం వ్యవసాయ, ఉద్యానవన తదితర శాఖ అధికారులతో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి సమీక్ష నిర్వహించి ఖరీఫ్ పంటల సాగుకవసరమైన ఎరువులు, విత్తనాల కొరత తలెత్తకుండా రైతులకు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. నకిలీ, నాసిరకం విత్తనాలతో రైతులు నష్టపోకుండా చూడాల్సిన గురుతర బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. మండల వ్యవసాయాధికారులు, విస్తీర్ణాధికారులు నకిలీ విత్తనాల బెడద లేకుడా పకడ్బందీ తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎవరైనా నకిలీ, నాసిరకం విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేయాలని, కేసులు నమోదు చేసి రికవరీ యాక్ట్ అమలు చేయాలన్నారు. జిల్లాలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ నిజామాబాద్‌ను గుడిసెలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. లేఅవుట్ వెంచర్లలో ఓపెన్ స్పేస్ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా పకడ్బంధీ చర్యలుతీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, తాహెర్‌బిన్ హందాన్, కేశ వేణు, అంతిరెడ్డి, రాజిరెడ్డి, గీత, దిలీప్‌కుమార్, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయలక్ష్మి , అధికారులు పాల్గొన్నారు.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి, డిఆర్ఓ రాజేశ్వరిలతో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన నోముల రాజేశ్వర్ రెడ్డి తమ ఇంటిని ఆన్లైన్లో నమోదు చేసేందుకు దరఖాస్తు చేసుకోగా పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తమ పేరు నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఎంపిడిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు రామగుండం గౌతమినగర్ కు చెందిన డి కాశయ్య మల్కాపురం గ్రామంలో సర్వేనెంబర్ 125/3 లో గల 20 ఎకరాల భూమి గతంలో ఎక్స్ సర్వీస్ మెన్ కోసం 1981 లో కేటాయించడం జరిగిందని , దీనిలో ఎటువంటి ప్రభుత్వ భవనాల నిర్మాణానికి అనుమతి ఇవ్వరాదని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఆర్డీవో పెద్దపల్లి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఓదెల మండలం గూడెం గ్రామానికి చెందిన వేముల నర్సమ్మ సర్వే నెంబర్ 474/1 లో ఎకరం భూమి ఉందని , తన భూమిని కొంతమంది ఆక్రమించాలని చూస్తున్నారని, తన భూమి జోలికి ఎవరు రాకుండా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ ఓదెల కు రాస్తూ నిబంధనలు ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గోదావరిఖని సూర్య నగర్ కు చెందిన ఆర్. రాధ తన కుమారుడికి ప్రభుత్వ విద్యా సంస్థలోని హాస్టల్లో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ఆహార భద్రత నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### ఫుడ్ సేఫ్టీ అధికారి అంకిత్ రెడ్డి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, టిఫిన్ సెంటర్ల యజమానులు ఆహార భద్రత నియమాలు పాటించాలని, లేనియెడల కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారి అంకిత్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల ప్రకారం ప్రత్యేక తనిఖీ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం గోదావరిఖనిలో నమోదైన ఫుడ్ పాయిజనింగ్ ఘటన దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. మొత్తం 10 రెస్టారెంట్లు మరియు బేకరీలను తనిఖీ చేశామన్నారు. కొన్ని రెస్టారెంట్లలో రసాయన రంగులతో తయారు చేసిన ఆహార పదార్థాలను కూడా పారవేయడం జరిగిందని తెలిపారు. ఆహార భద్రత విషయంలో రాజీ పడేదిలేదని, రెస్టారెంట్లు, హోటల్స్, బేకరీలలో క్ర మం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తామని అపరిశుభ్ర వా తావరణంలో ఉంటే కఠినచర్యలు తప్పవని హెచ్చరించా రు.

## పద్మశాలి ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ స్వకులశాలి సమాజ భవనంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సును దిగ్విజయం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఈగ వేంకటేశ్వర్లు రూపొందించిన చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్లను సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు.అనంతరం పెద్దపల్లి జిల్లా టిపియుఎస్ అధ్యక్షులు కొనిపాక సారయ్య మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పబ్లిక్ సెక్టార్ సంస్థల్లో పనిచేస్తున్న పద్మశాలి ఉద్యోగులందరూ పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.ఈ సదస్సులో సంఘం ద్వారా చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలపై సమీక్షించడంతో పాటు,ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు మరియు భవిష్యత్ కార్యాచరణపై లోతుగా చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ అసోసియేట్ ప్రెసిడెంట్ గౌడ ఆంజనేయులు,ఉపాధ్యక్షులు తాటికొండ శంకర్,ప్రచార కార్యదర్శి పెండెం సత్యనారాయణ,ప్రాథమిక సభ్యులు ఆడెపు రవికుమార్,బండారి మల్లేష్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం



**ప్రజాపక్షం/ఆర్మూర్ :** మండలంలోని పల్లె (హరిపూర్) గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణలో ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన చేపూర్‌కు చెందిన అమూల్య, శ్రీనయపల్లె గ్రామానికి చెందిన అశ్రీత్‌లకు పల్లె గ్రామసర్పంచ్ పార్దేమ్ మనీషా సంజీవ్, ఎల్క రంజిత్ ఆధ్వర్యంలో మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సురకంటి చిన్నారెడ్డి సమక్షంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు శాలువతో సన్మానించి స్వంత నిధులతో పారితోషికం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు రాంసన్ చేపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు సరదా గంగాధర్, కార్యదర్శి ఆది శ్రీను, మాజీ ఉపాధ్యక్షులు జోరిగే ధర్మయ్య, సాయగౌడ్, కొంపల్లి సుధాకర్, కొంపల్లి భూమేష్, దేవరాజ్, అశోక్, భోజేందర్, తిరుపతి, రాజేష్ పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నివారణ కోసం అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** మండలంలోని బషీరాబాద్ జడ్పీహెచ్ఎస్‌లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు సోమవారం ఎస్ఐసీహెచ్ సతీష్ మాదకద్రవ్యాల నివారణ కోసం అవగాహన నిర్వహించి మాట్లాడారు. మాదకద్రవ్యాలతో కలిగే దుష్పరిణామాలు, యువత వాటికి దూరంగా ఉండాల్సిన అవశ్యకతను వివరించారు. డ్రగ్స్‌కు బానిసలు కావటంతో వ్యక్తిగత జీవితం, కుటుంబాలు ఎలా దెబ్బ తింటాయో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, సర్పంచ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## డిడిఒపిని సన్మానించిన న్యాయవాదులు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఇన్‌చార్జిగా నూతనంగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రహీమొద్దీన్‌ను జిల్లా కోర్టు న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్‌గౌడ్, పులి జైపాల్, పిల్లి శ్రీకాంత్, రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎస్‌బిఐ ప్రమాద బీమా చెక్కు అందజేత



**ప్రజాపక్షం/ఆర్మూర్:** పోచంపాడ్ మండల కేంద్రానికి చెందిన షేక్ అజీర్ ఇటీవల ఆకస్మికంగా చెరువులో పడి మృతి చెందగా ఎస్‌బిఐ ప్రమాద బీమా ఉండటంతో రూ.20 లక్షల ప్రమాద బీమా చెక్కును నామినిగా ఉన్న మృతుని భార్య ఫార్జానా బేగంకు సోమవారం ఆర్మూర్ పట్టణ కేంద్రంలోని ఎస్‌బిఐ బ్యాంకు మేనేజర్ శైలేందర్ అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది సజున్, శ్రీధర్ పృథ్వీ నారాయణ, అనూష సాయి పాల్గొన్నారు.

## పాలెం పాఠశాలలో బాలసభ

**ప్రజాపక్షం/మోర్తాడ్:** మోర్తాడ్ మండలంలోని పాలెం గ్రామ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రోజు బాలసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గ్రామ సర్పంచ్ పలిగిరి రాధా, ఉప సర్పంచ్ పాలెం శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం పల్లెపాటి వేణుగోపాల రావు, పంచాయతీ కార్యదర్శి మురళికాంత్, మహిళా ఆరోగ్య సిబ్బంది, వీవోఏ గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు. విద్యార్థులు పౌష్టికాహారం తినాలని, ఆకు కూరలు, పండ్లు తీసుకోవాలని, తినకపోతే రక్తహీనత, బలహీనత వివిధ రోగాలకు లోనవుతారని తెలిపారు. 14సంవత్సరాల లోపు విద్యార్థులందరూ పాఠశాలల్లో చదువుకోవాలని ఎవ రు కూడ బాలకార్మికులుగా పని చేయకూడదని పెద్దలందరూ తెలియచేశారు.

# గాలివానకు విరిగిపడిన వృక్షాలు

ప్రజాపక్షం/ముత్తారం : ఆదివారం రాత్రి కురిసిన భారీ గాలివాన బీభత్సానికి అడవి శ్రీరాంపూర్ నుండి ముత్తారం వెళ్లే ప్రధాన రహదారిపై చెట్లు,పెద్ద పెద్ద కొమ్మలు విరిగిపడ్డాయి.దీనివల్ల ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు,ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.రాకపోకలకు పూర్తిగా అంతరాయం ఏర్పడింది.రహదారిపై చెట్లు విరిగిపడిన విషయం తెలియగానే సర్పంచ్ కొట్టె అన్నపూర్ణ ఉపేందర్ తక్షణమే స్పందించారు. పాలకవర్గంతో కలిసి యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. రహదారికి అడ్డంగా పడిన చెట్లను, కొమ్మలను స్వయంగా దగ్గరుండి తొలగించి, రోడ్డును శుభ్రం చేయించారు.దీంతో వాహనదారులు, ప్రజల రాకపోకలు మళ్లీ సాఫీగా సాగుతున్నాయి.రోడ్డు క్లియరెన్స్ కార్యక్రమంలో వార్డు సభ్యులు నిమ్మతి సంపత్,గ్రామస్తులు పాల్గొని శ్రమదానం చేశారు.ప్రజలకు కష్టం వస్తే క్షణాల్లో స్పందించి, సమస్యను పరిష్కరించిన సర్పంచ్ కొట్టె అన్నపూర్ణ ఉపేందర్ కి,వార్డు సభ్యులకు అడవి శ్రీరాంపూర్, ముత్తారం గ్రామ ప్రజలు, వాహనదారులు ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.



## నేటి నుంచి రైతు వేదికల్లో విత్తన మేళా

ప్రజాపక్షం/గంగాధర : ఈనెల 23 నుంచి 30 వరకు మండలంలోని గంగాధర, బూరుగుపల్లి, కురిక్యాల, గర్శకుర్తి రైతు వేదికల్లో విత్తన మేళా నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు నాణ్యమైన విత్తనాలను ఒకే చోట అందుబాటులో ఉంచే ఉద్దేశంతో ఈ మేళాను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ విత్తన మేళాలో ప్రభుత్వం సూచించిన 7 సన్న రకాల వరి విత్తనాలు, పప్పు దినుసులు, కూరగాయల విత్తనాలు అలాగే నానో యూరియా, నానో డిఏపి లు రైతులకు అందుబాటులో ఉంటాయని వివరించారు. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించబడిందన్నారు. మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో కోరారు. గ్రామాలలోని రైతులు సమీప రైతు వేదికలను సందర్శించి నాణ్యమైన విత్తనాలను పొందాలని సూచించారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం

ప్రజాపక్షం/రామగిరి : లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం సెంటినరీ కాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, క్లబ్ ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్‌గా విచ్చేసిన జిల్లా మాజీ గవర్నర్ లయన్ డా. విజయ రేకులపల్లి నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షురాలిగా డా. శరణ్య యాదవ్, కార్యదర్శిగా కాటం సత్యం, కోశాధికారిగా టి.వి. సురేష్ బాబు, ఉపాధ్యక్షుడిగా బుద్ధార్థి బుచ్చన్నతో పాటు వివిధ చైర్ పర్సన్‌లు బాధ్యతలు స్వీకరించారు.అనంతరం డా. విజయ రేకులపల్లి మాట్లాడుతూ గత పాలకవర్గం సేవా కార్యక్రమాల్లో విశేష కృషి చేసిందని, ఒకే సంవత్సరంలో 165 సేవా కార్యక్రమాలను నిర్వహించి 7,539 మంది లబ్ధిదారులకు సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జి.ఎస్.టి కోఆర్డినేటర్ సాదుల వెంకటేశ్వర్లు, జిల్లా సెక్రటరీ రామకిషన్, రీజనల్ చైర్మన్ కావేటి రాజగోపాల్, జోనల్ చైర్మన్ భాస్కర్ రావు,వేల్పుల మహిళా చైర్ పర్సన్‌లు, సభ్యులు స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## క్రషర్ నిర్మాణం పేరుతో ప్రభుత్వ భూమి స్వాహాకు యత్నం

ప్రజాపక్షం/శంకరపట్నం: ప్రభుత్వ భూమి కనిస్తే చాలు కబ్జాదారులకు పండగే. ప్రభుత్వ భూమిని ఎలాంటి అనుమతి లేకుండానే తమ స్వాధీనం చేసుకొని ఏకంగా ఒక క్రషర్ పనులనే ప్రారంభించారు. వివరాలు ఇలా ఉన్నాయి.కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం గ్రామంలోని పెద్దగుట్ట ప్రాంతంలో అనుమతులు లేకుండా అక్రమంగా క్రషర్ నిర్మాణం పనులు చేపడుతున్నారు.వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన సమ్మయ్య అనే వ్యక్తి గతంలోనే క్రషర్ నిర్మాణ పనులు చేపడితే గ్రామస్తులు అందరూ కలసి ఏకమై అక్రమంగా నిర్మిస్తున్న క్రషర్ పనులను నిలిపి వేయించారు.గ్రామస్తులంతా కలసి క్రషర్ సామాగ్రిని గ్రామపంచాయతీలోకి తరలించారు.ఇక చేసేదేమి లేక ఇకపై క్రషర్ నిర్మాణం పనులు చేయనని చెప్పి సామాగ్రిని తీసుకెళ్లాడు.ఇప్పుడు అనుమతి పత్రాలు ఉన్నాయంటూ అనుమతి పత్రాలను తప్పుగా ఉపయోగించుకుటూ మళ్లీ క్రషర్ పనులు మొదలుపెట్టాడు.ప్రస్తుతం పెద్దగుట్ట ప్రాంతంలో క్రషర్ నిర్మాణ పనులు చేపడుతూ ఓ రూమ్ నిర్మాణం కూడా చేశారు.అన్నిటికి అనుకూలంగా ఉండేలా ఈ రూమ్ నిర్మాణం చేశారు.గతంలో ఇదే ప్రాంతంలో ఈ వ్యక్తి గుడుంబా తయారు చేశాడు.ఒకవైపు ప్రభుత్వ స్థలాన్ని క్రమించడమే కాకుండా అక్రమంగా క్రషర్ నిర్మాణంతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారుతుందని గ్రామ ప్రజలుఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉంటే ఇదే అదునుగా చేసుకొని మరికొంత మంది పెద్ద గుట్ట ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూమిని తమ వశం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.ఈ అక్రమ నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు తీసుకొని పెద్ద గుట్ట ప్రాంతంలోని ఖాళీ స్థలంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.అక్రమార్కుల చెర నుండి ప్రభుత్వ భూమిని విడిపించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## విద్యుత్ ఘాతానికి మేకలు మృతి

ప్రజాపక్షం/శంకరపట్నం: విద్యుత్ ఘాతానికి గురై రెండు మేకలు మృతి చెందాయని మేకల కాపరి ఆవేదన వ్యక్తం చేశాడు.స్థానికులు తెలిపిన సమాచారం మేరకు సోమవారం మండల పరిధిలోని చింతలపల్లి గ్రామంలో ఓ రైతు తన వ్యవసాయ పంట పొలంలో వరి కొయ్యలను కాల్చేందుకు నిప్పు అంటించాడు. మంటలు చెలరేగి వ్యవసాయ క్షేత్రంలోని భావి వద్ద ఉన్న విద్యుత్ సర్వీస్ వైరు మంటల్లో దగ్ధమై విద్యుత్ వైరు తేలి ఉండడంతో విద్యుత్ ఘాతానికి గురై రెండు మేకలు మృతి చెందాయని తెలిపారు.మృతి చెందిన మేకల విలువ సుమారు 20వేల వరకు ఉటుందని అన్నారు.సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మృతి చెందిన మేకలకు నష్టపరిహారం అందించి ఆర్థికపరంగా ఆదుకోవాలని మేకల కాపరి ఐలయ్య కోరారు.



**రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయ అధికారులు విఫలం:** రైతులకు వ్యవసాయంపై కొత్త రకం పంటలు తదితర అంశాలపై అవగాహన కల్పించాల్సిన మండల స్థాయి అధికారులు విఫలమవ్వడం వల్లనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. రైతులువ్యవసాయ పంట పొలాల్లో వరి కొయ్యలను కాల్చడం వలన అందులో ఉండే మేలు కరం సూక్ష్మ జీవులు నశిస్తాయని వ్యవసాయ ఉన్నతాధికారులు సూచిస్తూ గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా స్థాయి ఉన్నతాధికారులు సూచిస్తున్న స్థానిక అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు వ్యవసాయ రంగంపై మెలకువలను తెలిపే విధంగా అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.

## 14 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదం

ప్రజాపక్షం/పెద్దపల్లి: కాల్వ శ్రీరాంపూర్ మండలం, మడిపల్లి గ్రామానికి చెందిన రైతు తొడుపునూరి రాజయ్య తన కుటుంబ భూమి కోసం గత 14 సంవత్సరాలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కానీ ఇప్పటికీ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నెం. 56లో 36 గుంటలు, సర్వే నెం. 57లో 8 గుంటల భూమి తమ కుటుంబానికి 1969 నుండి ఉంది. 2004లో గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా ROR చేయించుకున్నారని ఆయన ఆరోపించారు. 2012 ఏప్రిల్ 12న రెవెన్యూ అధికారులు మోక పైకి వచ్చి పంచనామా చేసి భూమి తొడుపునూరి రాజయ్యదే అని స్పష్టమైన రిపోర్టు B/263/2012 ఇచ్చారు. అయినా 14 ఏళ్ల గడిచినా రెవెన్యూ రికార్డులలో పేరు మార్చలేదు.ఇటీవల 25.01.2025 ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే కలెక్టర్ 30.01.2025న విచారణకు ఆదేశించారు. ఆర్డీవో కూడా 2025 ఆగస్టులో లేఖ రాశారు. కానీ తహసిల్దార్ ఆఫీస్ నుండి సరైన చర్యలు లేవని, పంచనామా తర్వాత కూడా అక్రమదారులు ఆ భూమిని వేరే వారికి విక్రయించారని బాధితుడు ఆరోపించారు. 2012లోనే అధికారులు తేల్చిన విషయంపై ఇప్పటికీ ఫైలు పెండింగ్‌లో ఉంచడం దారుణమైన విషయమని ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని అక్రమ ఆర్ఓఆర్ రద్దు చేసి మా పేరు పునరుద్ధరించాలి అని రాజయ్య కోరారు. ప్రభుత్వం రైతు సంక్షేమం గురించి మాట్లాడుతుంటే, 14 ఏళ్లుగా రైతు భూమి రికార్డుల్లో లేకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. ఈ విషయమై జిల్లా అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని అన్నారు.



## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి




ప్రజాపక్షం/పెద్దపల్లి : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ అన్నారు.అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన వారోత్సవాలలో భాగంగా రామగుండం సిపి ఆదేశానుసారం పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పెద్దపెల్లి ఏసిపి గజ్జి కృష్ణ మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం,పోలీస్ శాఖ విస్తృత చర్యలు చేపడుతున్నాయని తెలిపారు.డ్రగ్స్ విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ అరెస్టులు చేస్తున్నప్పటికీ, కొంతమంది యువత తెలిసో తెలియకో వాటి బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెద్దపెల్లి సిఐ ప్రవీణ్, ఎస్సై నరేష్ లు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల మానసిక సమతుల్యత దెబ్బతిని,కుటుంబ సభ్యులతో పాటు సమాజానికి ఇబ్బందులు కలుగుతాయని చెప్పారు.సాధారణంగా చిన్న ఆసక్తితో సిగరెట్ లేదా ఇతర మత్తు పదార్థాలను ప్రయత్నించడం ప్రారంభమై,క్రమంగా అది వ్యసనంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు.విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు జీవితానికి అవసరమైన విలువలను కూడా బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

ప్రజాపక్షం/కొత్తపల్లి : కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఆదేశాలమేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ వాసాల సతీష్ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ పోలీసు బృందం కొత్తపల్లి గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట స్థావరంపై మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో జూదగాళ్ల ఆట కట్టించి నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీపీ వాసాల సతీష్ తెలిపిన వివరాల ప్రకారం కొత్తపల్లి గ్రామంలోని సదరు స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అక్కడికక్కడే పట్టుకున్నారు. జూదరుల నుంచి రూ.18,940 నగదుతోపాటు వారి వద్ద 4 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. అరెస్టయిన నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న నగదు, సెల్ ఫోన్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కొత్తపల్లి పోలీస్ స్టేషన్ లో అప్పగించారు.

## జిల్లా నుంచి ఒద్యారం జెడ్‌పిహెచ్ఎస్ ఘనత

ప్రజాపక్షం/గంగాధర : ఎస్‌హెచ్ఆర్‌విఆర్ 2025–26 జాతీయ రేటింగ్స్ రాష్ట్రస్థాయిలో ఎంపికైన 10 పాఠశాలల్లో ఒకటిగా గంగాధర మండలంలోని ఒద్యారం జడ్పిహెచ్ఎస్ పాఠశాల నిలిచింది. ఈ గుర్తింపుతో పాఠశాలకు మెరిట్ సర్టిఫికేట్ తోపాటు రూ.1 లక్ష ప్రోత్సాహక నగదు లభించనున్నాయి. పాఠశాల పరిశుభ్రత, పచ్చదనం, ఆరోగ్యకర వాతావరణం కోసం ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల నిర్వహణ కమిటీ, గ్రామస్తులు చేసిన సమిష్టి కృషికి ఈ గుర్తింపు నిదర్శనం. తమ ఊరి పాఠశాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడం పట్ల అబ ధ్యాపకులు, విద్యార్థులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## గాలి దుమారానికి రేకుల షెడ్డు ధ్వంసం

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఆదివారం రాత్రి ఈదురుగాలులు,గాలి దుమారంతో కూడిన భారీ వర్షం కురిసింది.ఈ ప్రకృతి విపత్తు కారణంగా గ్రామానికి చెందిన పోలం శ్యామల అనే మహిళ ఇంటి పైకప్పు రేకులు పూర్తిగా విరిగిపడ్డాయి.గాలి తీవ్రతకు రేకులు ఎగిరిపోవడమే కాకుండా ముక్కలుగా విరిగిపడటంతో ఆమె ఇల్లు తీవ్రంగా దెబ్బతింది.ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని బాధితురాలు శ్యామల వేడుకుంటున్నారు.

# ఆది పై అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదు

ప్రజాపక్షం/వేములవాడ టౌన్: ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయంగా ఎదుర్కోలేకనే తమ నాయకుడు రాష్ట్ర ప్రభుత్వ విప్,కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏకైక మున్నూరు కాపు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పై కొందరు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూము మధు మండిపడ్డారు. ప్రజల్లో ఆది శ్రీనివాస్ పై రోజురోజుకు పెరుగుతున్న ఆదరణను జీర్ణించుకోలేక రాజకీయ ప్రత్యర్థులు నిరాధార ఆరోపణలకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. ఒక సామాన్య కుటుంబం నుంచి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆది శ్రీనివాస్ తన కష్టంతో, ప్రజల సమస్యలపై నిరంతర పోరాటంతో ఈ స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. ఎలాంటి రాజకీయ వారసత్వం లేకుండా, డబ్బు, అధికార అండదండలు లేకుండా ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న నాయకుడిగా ఆయన మహోన్నతమైన గుర్తింపు పొందారని అన్నారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన ధాన్యం అక్రమ రవాణా కేసును అడ్డం పెట్టుకుని కొందరు కావాలనే ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేరును వివాదంలోకి లాగేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ధాన్యం కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తికి సంబంధించిన కుటుంబ సభ్యుడు కాంగ్రెస్ నాయకుడు కావడమే తప్ప,ఆది శ్రీనివాస్‌కు ఆ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేదని వారు స్పష్టం చేశారు.అయినప్పటికీ ఆయన ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో కొందరు అసత్య ప్రచారానికి దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టం ముందు అందరూ సమానమే.ఎవరైనా తప్పు చేసి ఉంటే దర్యాప్తు సంస్థలు,న్యాయవ్యవస్థ తమ పని తాము చేసుకుంటాయి.కానీ ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రజా ప్రతినిధులను కేసులతో ముడిపెట్టడం రాజకీయ నీచ సంస్కృతికి నిదర్శనం అని మధు ధ్వజమెత్తారు.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై జరుగుతున్న ఈ దుష్ప్రచారం ప్రజల్లో ఏమాత్రం ప్రభావం చూపదని వారు ధీమా వ్యక్తం చేశారు.రాజకీయ ప్రత్యర్థులు అసత్యాలను ఎంతగా ప్రచారం చేసినా అవి సత్యాలుగా మారవని,చివరకు నిజమే గెలుస్తుందని స్పష్టం చేశారు.బీసీ వర్గాలకు చెందిన యువ నాయకుడిగా ఆది శ్రీనివాస్ సాధించిన రాజకీయ ప్రాధాన్యత కొందరికి అసహనంగా మారిందని,అందుకే వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, అభివృద్ధి, ప్రజా సేవలతో ముందుకు సాగుతున్న తమ నాయకుడిపై చేస్తున్న కుట్రలన్నీ అదే స్థాయిలో తిప్పికొడతామని పేర్కొన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేని వారు తప్పుడు ప్రచారాలు, వ్యక్తిగత దాడులు మానుకుని ప్రజా సమస్యలపై పోటీ పడాలనీ, ప్రజల తీర్పే అంతిమమని మధు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ప్రజాస్వామ్యవాదులు, బీసీ సంఘాలు, కాంగ్రెస్ కార్యకర్తలు తీవ్రంగా ఖండిస్తూ మీడియా, సోషల్ మీడియా వేదికల్లో వస్తున్న నిరాధార కథనాలను ప్రజలు నమ్మవద్దని వారు విజ్ఞప్తి చేశారు.



## నిబంధనలు పాటించని పానీ పూరి విక్రయ కేంద్రాలపై చర్యలు

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : ఆహార భద్రత నిబంధనలు పాటించని పలు పానీ పూరి విక్రయ కేంద్రాలపై అధికారులు చర్యలు తీసుకున్నారు. కేసు నమోదు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు, సిరిసిల్ల వేములవాడ పట్టణాల్లో రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, వైద్య శాఖ అధికారులు, ఆహార భద్రతా అధికారి సంయుక్తంగా పానీపూరి విక్రయ దుకాణాల్లో ఇటీవల తనిఖీ చేశారు. సిరిసిల్లలోని కైలాస్ పానీ పూరి, శివ్ కైలాస్ బేల్, అలాగే వేములవాడ లోని అనిల్ పానీ పూరి, శ్రీ బాలాజీ చాట్ భండార్, శ్రీ లక్ష్మీ చాట్ భండార్, సాయి చాట్ భండార్, దేవీ నారాయణ చాట్ భండార్, శ్రీ లక్ష్మీ చాట్ భండార్ లో తనిఖీ చేయగా, అపరిశుభ్రమైన పరిసరాల్లో తయారు చేసిన పానీ పూరీలు, పప్పు, పరిశుభ్రంగా లేని నీరు, ఉల్లిగడ్డలు, ఆలు గడ్డలు అధికారులు గుర్తించారు. ఆహార పదార్థాల తయారీ లో పాటించాల్సిన జాగ్రత్తలు నియమాలపై అవగాహన కల్పించారు. పని సమయంలో తప్పనిసరిగా ఆప్రాన్లు, హెయిర్ క్యాప్స్ ధరించాలని వారికి ఆదేశాలు జారీ చేశారు. సరైన ఆహార భద్రత ప్రమాణాలు పాటించని ఆయా దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేశారు. జిల్లాలోని అన్ని ఆహార పదార్థాల విక్రయ దుకాణాల్లో నిరంతరం ఆకస్మిక తనిఖీ చేస్తామని, నిబంధనలు పాటించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

## జిల్లా కలెక్టర్ కు అధికారుల శుభాకాంక్షలు

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : జనగణన –2027 లో భాగంగా మొదటి దశ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించి.. రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలవడంతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. జనగణన–2027లో భాగంగా నిర్వహించిన తొలి దశ గృహ జాబితా, గృహాల లెక్కింపు కార్యక్రమం 2026 మే 11న ప్రారంభమై జూన్ 9వ తేదీన ముగియగా, రాష్ట్రస్థాయిలో కచ్చితత్వ వివరాల నమోదు, ప్రక్రియ సరిగా పూర్తి చేయడం సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ రాజన్న సిరిసిల్ల (డోర్స్) తరఫున జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను



మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి.. శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో డోర్స్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అఫ్జల్ బేగం, సీపీఓ శ్రీనివాసాచారి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం

ప్రజాపక్షం/వేములవాడ టౌన్: వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ వేములవాడలో 5వ తరగతి చదువుతున్న హెప్సిబా రెచల్ జన్మదిన సందర్భంగా చిన్నారి చే మొక్కను నాటించి సంరక్షణ బాధ్యతను అప్పగించడమైనది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ



పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని, ప్రతి శుభకార్యానికి ప్రతి ఒక్కరు తమ వంతుగా రెండు మొక్కలు విధిగా నాటే సామాజిక బాధ్యతను చేపట్టాలని, స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరు తీసుకోవాలని, భూమండలంపై కాలుష్యాన్ని తగ్గించేందుకు, ప్రాణవాయువు శాతాన్ని పెంచేందుకు, వర్షాలు పడేందుకు, విపత్తుల సమయంలో చెట్లు ఎంతగానో ఉపయోగపడతాయని, పర్యావరణ సమతుల్యతను కాపాడడానికి మరియు స్వచ్ఛమైన గాలిని పొందడానికి మొక్కలు నాటడం అత్యంత ఆవశ్యకమని, మొక్కలు నాటడం అనేది కేవలం ఒక కార్యక్రమంలో కాకుండా దైనందిన జీవితంలో భాగం కావాలని, ప్రాథమిక పాఠశాల దశలోనే పిల్లలకు మొక్కల పెంపకం పై అవగాహన మరింత పెంచే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని, ఇంట్లో లేదా పరిసరాలలో సులభంగా పెరిగే నీడనిచ్చే చెట్లు, పూల మొక్కలు మరియు పండ్ల మొక్కలను ఎంచుకోవడం మంచిదని, అటవీశాఖ లేదా స్థానిక నర్సరీలు ద్వారా అవసరమైన మొక్కలను సులభంగా పొందవచ్చునని, మొక్కల పెంపకంతో కాలుష్యాన్ని నియంత్రించవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీ నారాయణ, దాసరి సుజాత, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్య, క్రీడలు, సాంస్కృతిక, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలి

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్య, క్రీడలు, సాంస్కృతిక, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించి తమ లక్ష్యాలను సాధించాలని డి.ఎస్.పి నాగేంద్ర చారి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణా నివారణపై సిరిసిల్ల గీతా నగర్ ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవాలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నమన్నారు. డ్రగ్స్, గంజాయి,ఇతర మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా కుటుంబం, సమాజం, దేశ భవిష్యత్తుపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు ఇతరులను కూడా అప్రమత్తం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఎవరైనా మాదకద్రవ్యాల వినియోగం లేదా విక్రయాలకు పాల్పడుతున్నట్లు తెలిసిన వెంటనే తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్ నంబర్ 8712671111కు లేదా సమీప పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ఎస్.ఐ నాగరాజు, పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## మహిళ సంఘం భవనానికి శంకుస్థాపన

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: మండలం లోని ఇందిరాక్రాంతి మహిళ సంఘం భవనానికి గ్రామసర్పంచ్ పద్మబాలయ్య, ఉపసర్పంచ్ గొట్టె శ్రీకాంత్ అధ్వర్యంలో భూమి పూజ చేశారు. సోమవారం హనుమాన్ స్వశక్తి మహిళ సంఘం భవనానికి, వారి అభ్యున్నతి కోసం రెండో సంఘం నిర్మాణానికి భూమి పూజ చేసినట్లుగా పాలకవర్గం మీడియాతో తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మేడిశెట్టి ప్రభాకర్, రాగుల చరణ్, ప్రవీణ్, శ్రీనివాస్, వీవో అధ్యక్షురాలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజావాణి: కలెక్టర్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల: సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి.. ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించి పరిష్కారానికి ఆదేశించారు. మొత్తం 159 అర్జీలు రాగా, సంబంధిత అధికారులకు అందజేశారు.

**సద్వినియోగం చేసుకోవాలి:** జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తోపాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని సూచించారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖితారెడ్డి, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ ఇఒపై ప్రజావాణిలో ఫిర్యాదు

ప్రజాపక్షం/వేములవాడ: వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఈవో రమాదేవితో పాటు మరో 30 మంది ఆలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో బీజేపీ కౌన్సిలర్లతో కలిసి మోచీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, 17వ వార్డు కౌన్సిలర్ కొండ్లెపు ముత్యం జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఇటీవల తనపై జరిగిన ఘటనను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి సంబంధిత అధికారులకు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ముత్యం మాట్లాడుతూ, తాను దళితుడినైనే కారణంతో ఉద్దేశపూర్వకంగా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా, గౌరవాన్ని కించపరిచేలా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మైలారం శ్రీనివాస్, శివ లక్ష్మీ నారాయణ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరిధాన్యం కొనుగోలు

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : రాజన్నసిరిసిల్లా జిల్లాలో వరిధాన్యం కొనుగోలు కుంభకోణం జరిగిందని జిల్లా ప్రజాఉద్యమకారుడు రంజిత్ తీవ్రంగా ఆరోపించారు.ప్రత్యేక విచారణ చేపట్టాలని సివిల్ సప్లై, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు వరిధాన్యం కుంభకోణంపై ఎల్లారెడ్డిపేట, కిషన్‌దాస్‌పేట కేంద్ర తపాలాశాఖ ద్వార పిర్యాదు అయ్యారు,అనేక అక్రమాలు గత కొన్ని సంవత్సరాలు జరుగుతున్నాయని ఆధారాలతో కొనుగోలు కేంద్రాలు,రైస్‌మిల్లర్లు కుమ్మక్కయ్యారని సోమవారం మీడియా ప్రకటన విడుదల చేశారు. మిల్లింగ్‌కు పంపిన ధాన్యం, ప్రభుత్వానికి అప్పగించిన బియ్యం, మిగిలిన ధాన్యం నిల్వలపై వివరాలు సేకరించమని అన్నారు.ఉన్నతాధికారులు దృష్టిపెట్టి చర్యలు తీసుకోవాలని మారవేణి రంజిత్ డిమాండ్ చేశారు.

## అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

ప్రజాపక్షం/ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం బద్దనకల్ గ్రామానికి చెందిన, బాలసాని బాలరాజు 40 సంవత్సరాల వయసు అప్పుల బాధతో సోమవారం, ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డా సంఘటన బాధాకల్ గ్రామాల్లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బదనకల్ గ్రామానికి చెందిన బాలసాని బాలరాజు నాలుగు సంవత్సరాల క్రితం తన భార్య కు క్యాన్సర్ రాగా వైద్యం కోసం పది లక్షల వరకు అప్పు చేశాడని, ఉన్నప్పుని ఎలా తీర్చాలి అని మానసిక ఒత్తిడికి గురై , ఊరు చివర ఉన్న రావి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాని, మృతుడి మామ గడ్డం సత్తయ్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు ఎస్సై జ్యోతి తెలిపారు.